క్లుప్తంగా

నేడు వేల్పూరుకు బొల్లా రాక

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం బ్రహ్మనాయుడు కల్యాణ మండపంలో మండలస్థాయిలో వైఎస్సార్ ఆసరా, వలంటీర్లకు వందనం కార్యక్రమాలు ఉదయం–సాయంత్రం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి గురువారం తెలిపారు.

తూబాడులో ఆలయ ప్రతిష్ట

నాదెండ్ల: తూబాడులో నూతనంగా నిర్మించిన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయ ప్రాణ ప్రతిష్టా కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం 11.50 గంటలకు పుష్యమి నక్షత్ర ముహూర్తాన ఆలయ యంత్ర ప్రతిష్ట మహోత్సవం వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ పాంచరాత్ర భగవత్ శాస్త్రోక్త ప్రకారం పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామం నుంచే కాక పలు ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గోత్రనామ పూజలు నిర్వహించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): జేఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినుకొండ రూరల్ మండలం నడిగడ్డ జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా వైస్ చైర్మన్ దూలం మునిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు పి.నారాయణరావు, కొమ్మ చంద్రశేఖర్, పాఠశాల హెచ్ఎం హేమంత్ కుమార్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, మహమ్మద్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అనురాధ ఆదేశాల మేరకు వినుకొండ రూరల్ ఉప్పరపాలెం గ్రామంలో విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలు, ఇబ్బందులపై ప్రొజెక్టర్‌పై చూపించడం జరిగింది. ఈ సందర్భంగా పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు ఎం. నాగరాజకుమారి, స్కూల్ హెచ్ఎం బి.యలమందరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీటీచర్లు టి.సుజాత, కె.ఆరోగ్యం, ఏఎన్ఎం అంజాబీ, సీహెచ్‌వో సామ్రాజ్యం, ఆశలు ఎం. శ్రీదేవి, వై. శైలజ, డి.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమే బాధ్యత వహించాలి

నరసరావుపేట: ఢిల్లీ సరిహద్దుల్లో తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న రైతులపై కాల్పులు జరిపిన కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాన్ని అందరూ ఖండించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. హర్యానా, కేంద్ర ప్రభుత్వ దుర్మార్గానికి ముక్కుపచ్చలారని యువ రైతు కరణ్‌సింగ్‌తో పాటు మరో ఇద్దరు రైతులను ప్రభుత్వం పొట్టన పెట్టుకుందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గురువారం ప్రజా సంఘాల కార్యాలయంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు అధ్యక్షతన రైతుల మృతికి సంతాపం తెలిపారు. ర్యాలీగా వెళ్లి బస్టాండ్ దగ్గరలోని మార్కెట్ యార్డు ఎదురు రైతు, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు కంబాల ఏడుకొండలు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు నల్లపాటి రామారావు, సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు గుంటూరు విజయ్‌కుమార్, పట్టణ కార్యదర్శి షేక్ శిలార్, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి కోంద్రు ఆంజనేయులు, ముస్లిం జేఏసీ నాయకులు జిలాని పాల్గొన్నారు.

విద్యా వికాసంతోనే అభివృద్ధి

యడ్లపాడు: విద్యతోనే బాలికలు అభ్యున్నతిని సాధిస్తారని, కాబట్టి తప్పనిసరిగా ప్రతి బాలికకు విద్యాభ్యాసం అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ఎం.జోజమ్మ చెప్పారు. మండలంలోని చెంఘీజ్ ఖాన్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కె.వి.శంకర్, ఏఎన్ఎం శ్రావణి, రామసుబ్బమ్మ, అంగన్వాడీ కార్యకర్త పద్మజ ఆరోగ్య విషయాలపై వివరించారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

నాదెండ్ల: విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త ఒక్కడేనని, సాటి మానవుల సేవతోనే ఆ భగవంతుని ప్రసన్నత పొందవచ్చనేదే హజరత్ మహబూబ్ సుభాని బోధనల సారాంశమని దర్గా కమిటీ సభ్యులు చెప్పారు. అప్పాపురం గ్రామంలో కొలువైయున్న హజరత్ మహబూబ్ సుభాని బాబా దర్గా 16వ ఉరుసు మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం గంధ మహోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

హక్కులపై అవగాహన ఉండాలి

నరసరావుపేట ఈస్ట్: బాలికలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.పార్వతి, షేక్.గౌసియా తెలిపారు. బస్టాండ్ సమీపంలోని హార్డ్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బాలికల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సూపర్‌వైజర్లు మాట్లాడుతూ, బాలికలు తమకు రక్షణ కల్పించే చట్టాలను గురించి తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ వినుకొండ

అభివృద్ధికి కేరాఫ్‌గా నిలుస్తోంది వినుకొండ. వెనుకబడిన ప్రాంతంగా పిలువబడే ఈ పరగణా ఇవాళ జగనన్న సుపరిపాలనలో, ఎమ్మెల్యే బొల్లా సారథ్యంలో అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. పార్టీలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధి చేపట్టి అందరి చేత శభాష్ అనిపించుకుంటోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. గుక్కెడు మంచినీటికి కరువైన ఈ సీమలో ఇవాళ పుష్కలంగా తాగునీరు అందిస్తూ.. అభివృద్ధి బాటన పరుగులు పెట్టిస్తున్న ఘనత బ్రహ్మన్నదే.



- మెజార్టీ–అభివృద్ధిలో వైఎస్సార్ సీపీ రికార్డు
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధి
- వేల్పూరులో కోట్ల రూపాయలతో పనులు
- గతంలో స్వగ్రామాలను పట్టించుకోని మాజీ ఎమ్మెల్యేలు
- ఐదేళ్లల్లో అభివృద్ధి చేసి చూపించిన ఎమ్మెల్యేగా బొల్లా రికార్డు

వినుకొండ(నూజెండ్ల): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్యేకత కల్గిన వినుకొండ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. వినుకొండకు మొట్టమొదటి ఎమ్మెల్యేగా పులుపుల వెంకటశివయ్య కమ్యూనిస్టు పార్టీ విజయం సాధించింది. అయితే అప్పటినుంచి వినుకొండ వెనుకబడిన ప్రాంతంగా ఉంది. రాష్ట్ర విభజన అనంతరం వినుకొండలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ వినుకొండ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో బొల్లాబ్రహ్మనాయుడు 29వేల మెజార్టీతో గెలుపొందారు. నియోజక వర్గం ఏర్పడిన నాటి నుంచి వినుకొండలో జరగని అభివృద్ధి కేవలం ఐదేళ్లలో ఆయన చేసి చూపించారు. స్వగ్రామమైన వేల్పూరు గ్రామంలో కోట్లాది నిధులతో అభివృద్ధి చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యేల గ్రామాల్లో సైతం అభివృద్ధి చేసి చూపిన ఘనత కూడా బ్రహ్మనాయుడే దక్కించుకున్నారు.

అభివృద్ధి పథంలో వేల్పూరు

ఏ రాజకీయ నాయకుడికైనా సొంత గ్రామంపై మమకారం ఉంటుంది. బొల్లా బ్రహ్మనాయుడు స్వగ్రామమైన వేల్పూరు నియోజకవర్గంలోనే మేజర్ పంచాయతీగా గుర్తింపు ఉంది. స్వగ్రామంలో సొంత నిధులతోపాటు, ప్రభుత్వ నిధులతో గ్రామాన్ని పట్టణంలో ఉండే సౌకర్యాల మాదిరిగా తీర్చి దిద్దారు. అలాగే మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జున రావుల స్వగ్రామాలైన ఇనిమెళ్ల, గోనుగుంట్ల వారిపాలెం గ్రామాల్లో అభివృద్ధిని పరుగులెత్తించారు. కనీస వసతులు లేని గ్రామాలల్లో అన్నీ మౌలిక సౌకర్యాలు కల్పించి ఆదర్శ ఎమ్మెల్యేగా పేరు పొందారు.

చేసిన అభివృద్ధి పనులు..

- నియోజకవర్గంలో పెద్ద గ్రామమైన వేల్పూరు
- రెండు గ్రామసచివాలయాలు ఏర్పాటు చేశారు.
- గ్రామంలో ప్రధాన రహదారి గంటావారిపాలెం మీదుగా 3 కిలోమీటర్లు దూరం ఉండగా ఒక కిలోమీటరు దూరం తగ్గిస్తూ నూతన రహదారి నిర్మించారు.
- గ్రామంలో రూ.1.79 కోట్ల నిధులతో సచివాలయం, రైతు భరోసా కేంద్రం
- వేల్పూరు–2లో రూ.91.5 లక్షల నిధులతో హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, సచివాలయం నిర్మించారు.
- రూ.4.5 కోట్ల నిధులతో కోల్డ్ స్టోరేజీ నిర్మించారు.
- రూ.4 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు
- రూ.3.37 కోట్లతో గ్రావెల్ సీసీ రోడ్లు నిర్మించారు.



ఇనిమెళ్లలో నూతనంగా నిర్మించిన సచివాలయ, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ భవనాలు



పెదకంచర్లలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

- రూ.1.2 కోట్ల నిధులతో నాడు–నేడులో భాగంగా పాఠశాలల మరమ్మతులు చేశారు.
- కోటి రూపాయల నిధులతో ప్రత్యేకంగా సైడ్ డ్రైయిన్స్ నిర్మించారు.
- రూ. 80 లక్షలతో గోదాముల నిర్మాణం
- గ్రామంలో 8,253 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.22.01 కోట్లతో సంక్షేమపథకాలు అందించారు.
- ఒక్క వేల్పూరు గ్రామంలోనే రూ.35 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి చేశారు.

సొంత నిధులతో....

గ్రామంలో రూ.5 కోట్ల సొంత నిధులతో భారీ కల్యాణ మండపం నిర్మించి ప్రజలకు ఉచితంగా అందజేశారు. అలాగే గ్రామంలో వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణంతో పాటు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసి ఉచితంగా తాగునీరు అందిస్తున్నారు. గ్రామంలో ఎలాంటి అవసరాలు ఉన్నా సొంత నిధులు వెచ్చించి కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వగ్రామమైన ఇనిమెళ్ల గ్రామంలో కూడా తనదైన మార్పుతో అభివృద్ధి చేశారు.

మరో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు స్వగ్రామమైన పెదకంచర్ల గ్రామసచివాలయం పరిధిలో గోనుగుంట్లవారిపాలెంలో అభివృద్ధి చేపట్టారు.

జగనన్న సాయంతోనే....

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో గ్రామాల రూపురేఖలనే మార్చివేశారు. రాజకీయాలకు అతీతంగా, పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడంలో తనదైన ముద్రను వేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామాల్లో అభివృద్ధి జరగడంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాత్ర మరువ లేనిదని నియోజకవర్గ ప్రజలు జేజేలు పలుకుతున్నారు.



వేల్పూరులో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం



వేల్పూరులో నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్

ఇనిమెళ్ల గ్రామంలో అభివృద్ధి

- రూ.40 లక్షలతో సచివాలయం
- రూ.3 లక్షల నిధులతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్
- రూ. 22 లక్షల తో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు
- రూ.17.9 లక్షలతో హెల్త్ సెంటర్ నిర్మాణం
- రూ.1.17 కోట్లతో కల్వర్టులు, గ్రావెల్‌రోడ్లు, సీసీ రోడ్లు నిర్మించారు.
- నాడు–నేడు పనుల్లో భాగంగా గ్రామంలోని పాఠశాలలను రూ.1.57 కోట్లతో మరమ్మతులతో పాటు రూ.48 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు.
- గ్రామంలో 3,819 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.10.10 కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల రూపంలో అందించారు.

గోనుగుంట్లవారిపాలెంలో...

- రూ.1.20 కోట్లతో సీసీ రోడ్డు
- రూ.70 లక్షలతో సీసీ డ్రెయిన్స్
- రూ.70 లక్షల నిధులతో పెదకంచర్ల, కోటప్పనగర్ పాఠశాలల అభివృద్ధి
- రూ.40 లక్షలతో సచివాలయం
- రూ.28 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ కింద పైపులైన్ నిర్మాణం
- రూ.21.70లక్షలతో రైతు భరోసా కేంద్రం
- రూ.19 లక్షలతో హెల్త్ సెంటర్
- 5,713మంది లబ్ధిదారులకు రూ.16.20 కోట్ల నిధులు సంక్షేమ పథకాల రూపంలో అందించారు.



ఇనిమెళ్లలోని ఉన్నత పాఠశాల ఇలా..



వేల్పూరులోని సీసీ రోడ్లు

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం



వినుకొండ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి గతంలో 9 మంది ఎమ్మెల్యేలు పనిచేసినప్పటికీ కొంతవరకు మాత్రమే అభివృద్ధి చేయగలిగారు. కనీసం వినుకొండకు తాగునీరు కూడా అందించలేని పరిస్థితుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండ రూపురేఖలు మార్చాం. తాగునీటి సమస్య లేకుండా సింగర చెరువును 270 ఎకరాలు అభివృద్ధి చేసి ప్రతిరోజు తాగునీరు అందిస్తున్నాం. 14 ఏళ్ల తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ సమస్యలను ఆసరాగా తీసుకొని ప్రజాధనం దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదు. గతంలో జరుగని అభివృద్ధిని ఐదేళ్లల్లో చేసి చూపించాం. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేశాం. రానున్న రోజుల్లో వినుకొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం.

–బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్యే, వినుకొండ

వలంటీర్ వ్యవస్థతోనే ప్రజల వద్దకు పాలన

వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేసిన ఎమ్మెల్యేలు

నరసరావుపేట: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రజల వద్దకే పాలన వలంటీర్ వ్యవస్థ ద్వారానే సాధ్యమైందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రకాష్‌నగర్ టౌన్‌హాలులో గురువారం నిర్వహించిన పట్టణ వలంటీర్లకు వందనం మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలోని 34 వార్డులకు 432 మంది వలంటీర్లకు అవార్డులు వరించాయని వారిలో 415 మందికి సేవా మిత్ర, ఐదుగురికి సేవారత్న, ఇద్దరికీ సేవా వజ్ర అవార్డులు రావడం జరిగిందన్నారు. జగనన్న ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలబడి లంచాలు, వివక్షకు తావులేకుండా ప్రభుత్వ సేవలు అందిస్తున్న నిస్వార్థ సేవా సైనికులైన వలంటీర్లు అభినందనీయులన్నారు. ఇంత సేవ చేస్తున్న వలంటీర్లపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్రంలో మహిళల అదృశ్యం వలంటీర్ల వలనే జరుగుతుందని దుర్మార్గపు ఆరోపణ చేశాడన్నారు. అలాగే మధ్యాహ్న సమయంలో ఇంట్లో మగవారులేని సమయంలో వలంటీర్లు ఇళ్లకు వెళ్లి తలుపులు తడుతున్నారని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సిగ్గుమాలిన మాటలు మాట్లాడాడని గుర్తు చేశారు. ఈసందర్భంగా సేవా వజ్రా అవార్డు పొందిన కొమెరగిరి జ్యోతి, విద్యాబత్తుని సునీత, సేవా రత్న అవార్డు పొందిన ఎం.పావని, సంపత్‌కుమార్‌లకు దుశ్శాలువతో చిరు సత్కారం చేసి పురస్కారాలను అందజేశారు.



నరసరావుపేటలో మహిళా వలంటీర్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

వినుకొండ(నూజెండ్ల): పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందించడంలో వలంటీర్లు మెరుగైన పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని జాషువా కళాప్రాంగణం నందు వినుకొండ రూరల్ మండలం వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. అనంతరం వలంటర్లీకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, జడ్పీటీసీ విజయలక్ష్మీ రాజా తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేస్తున్న సంక్షేమ వారధులని ఎంపీపీ దేవినేని శంకరరావు చెప్పారు. పట్టణం, చిలకలూరిపేట మండల పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని పురపాలక సంఘ కార్యాలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. పట్టణ పరిధిలో కోనంకి సుష్మ, జొన్నలగడ్డ ఇర్మియాలకు సేవావజ్ర, ఐదుగురికి సేవారత్న, 522 మందికి సేవా మిత్ర అవార్డులు అందించారు.



వినుకొండలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



చిలకలూరిపేటలో అవార్డులు అందజేస్తున్న ఎంపీపీ దేవినేని శంకరరావు

చిలకలూరిపేట మండలానికి సంబంధించి షేక్ నాగుర్‌వలికు సేవావజ్ర, ఐదుగురికి సేవా రత్న, 275 మందికి సేవామిత్ర అవార్డులు అందించారు. సేవావజ్ర అందుకున్న వారికి రూ. 45వేలు, సేవా రత్నకు ఎంపికైన వారికి రూ. 30వేలు, సేవామిత్ర ఎంపికైన వారికి రూ. 15వేలు చొప్పున నగదు పురస్కారాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, మున్సిపల్ కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, షేక్ మస్తాన్‌వలి, మీరాబి, ఎంపీడీవో పాల్గొన్నారు.

పిటిషన్లు వేసి ముస్లింలను ఇబ్బంది పెట్టాడు!

- ఆర్టీసీ స్థలంపై సిగ్గుమాలిన మాటలు మానుకోండి
- అరవిందబాబుకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి హితవు
- మసీదు నిర్మాణానికి రూ.10 లక్షల నగదు సాయం

నరసరావుపేట: నిర్మాణంలో ఉన్న అంజుమన్ కాంప్లెక్స్‌పై కోర్టులో పిటిషన్లు వేయించి నిర్మాణం జరగకుండా చేసి 72 మంది పేద ముస్లిం కుటుంబాలను టీడీపీ నాయకుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఇబ్బందికి గురిచేశాడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం వరవకట్టకు ఎదురుగా నిర్మాణంలో ఉన్న జామియా మసీదును ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. మసీదు నిర్మాణానికి తన వంతు సహాయంగా సొంత నిధుల నుంచి రూ.10 లక్షల నగదుతో పాటు మరో రూ.7లక్షల విలువైన సిమెంట్ కట్టలను అందజేశారు. మీడియాతో మాట్లాడుతూ కోర్టు ద్వారా నిర్మాణాన్ని ఆపించి మరోవైపు నంగనాసి కబుర్లు చెప్పటం అతనికే చెల్లిందన్నారు. ముస్లింలంటే తనకు చాలా గౌరవమని, రెండుసార్లు అత్యధిక మెజార్టీతో విజయం సాధించేందుకు వారే కారణమని వెల్లడించారు. మూడోసారి హ్యాట్రిక్ కొట్టటానికి మైనార్టీ సోదరులు ఎంతో శ్రమపడుతున్నారన్నారు. 2018లో టీడీపీ ప్రభుత్వం మసీదుని కూల్చి మసీద్ కాంప్లెక్స్ కట్టిస్తామని చెప్పారన్నారు. అంజుమాన్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రారంభం నుంచి కోర్టుకి వెళ్లడం, ముస్లిం సోదరులు ఇబ్బంది పెట్టడం తప్ప అరవింద్ బాబు వారికి చేసిందేమీలేదన్నారు. ఒకటిన్నర సంవత్సరాలుగా జమియా మసీదు నిర్మా ణం జరుగుతోందని, అది పూర్తి చేసి రంజాన్ నాటికి ముస్లిం సోదరులు ప్రార్థన చేసుకునే విధంగా చేస్తామన్నారు. గతంలో మసీదు నిమిత్తం రూ.77 లక్షల కట్టాల్సి వస్తే దానిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్యాబినెట్ సమావేశంలో పెట్టి రూపాయి ఖర్చు లేకుండా చేశామన్నారు. రూ.2 కోట్ల ఖర్చుతో మసీదు నిర్మిస్తున్నామన్నారు.



నిధులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ఆర్టీసీ స్థలంపై మాటలు విడ్డూరం

ఆర్టీసీ స్థలాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు కబ్జా చేశారని అరవిందబాబు చేసిన వాఖ్యలపై మాట్లాడుతూ అతని మాటలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ అనుమతులతో ఆర్టీసీకి చెందిన ఆ స్థలాన్ని టెండర్ ద్వారా రూ.30 లక్షలు చెల్లించి, ప్రతి నెల రూ.3 లక్షల అద్దె కడుతున్నారన్నారు. గ్యారేజ్ పక్కగా ఉన్న స్థలాన్ని టీడీపీ నాయకులు స్వాధీనం చేసుకొని డీమార్టు నిర్మాణం చేపడితే దానిపై అరవిందబాబు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, మిట్టపల్లి రమేష్, షేక్ ఖాదర్‌బాష, నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై నేరాలు జరగకుండా చూడండి

దిశ డీఎస్పీకి ఎస్పీ సూచన

నరసరావుపేట: జిల్లాలో మహిళలపై నేరాలు జరగకుండా చూడాలని దిశ నూతన డీఎస్పీ ఎం.సుధాకరరావుకు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సూచించారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన సుధాకరరావు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఒంగోలు పీటీసీలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో జిల్లా దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా నియమితులయ్యారు. పోక్సో కేసులలో ట్రయల్ త్వరగా జరిగి నిందితులకు శిక్ష పడేలా చేసి బాధితులకు భరోసా కల్పించాలని సూచించారు. ఇటువంటి నేరాలు అదుపులో ఉండే విధంగా కౌన్సెలింగ్‌లు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.



ఏస్పీ రవిశంకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దిశ డీఎస్పీ సుధాకరరావు

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

సవాల్ విసిరిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: అబద్ధాల అరవిందబాబు నీకు దమ్ము, ధైర్యం ఉంటే అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధం.. చర్చకు రండి అంటూ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం రూ.4.30 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలుగుదేశం నాయకులు గోనుగుంట కోటేశ్వరరావు చేసిన విమర్శపై చర్చకు సిద్ధమా అన్నారు. ఏ గవర్నమెంట్‌లోనైనా రొంపిచర్లకు మంచినీరు ఇచ్చారా? వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంచినీరు అందిస్తున్నాం.. ఇది అభివృద్ధి కాదా అన్నారు. రూ.75 కోట్లతో కేంద్రియ విద్యాలయం, కళ్యాణ మండపాలు, సచివాలయాలు, హాస్పటల్స్, ఆర్‌బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, గోదాంలు నిర్మించాం. వచ్చే విద్యా సంవత్సరం నుండి సంతగుడిపాడులో వెటర్నరీ పాలిటెక్నిక్, రొంపిచర్లలో కేంద్రీయ విద్యాలయాలు ప్రారంభమవుతాయన్నారు. ఇది అభివృద్ధి కాదా, మీకు కనుబడుట లేదా.. అన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి

శావల్యాపురం: పదోవ తరగతి విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తేవాలని పోట్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింగశెట్టి అన్నపూర్ణమ్మ అన్నారు. గురువారం మండలంలోని పోట్లూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో పదోవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు.

ఆడపిల్లలను రక్షిద్దాం, చదివిద్దాం

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని స్వచ్ఛంద సంస్థ భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ బత్తి రాములు, సీడీపీవో బి.అరుణ, ఎంపీడీఓ ఏవీ విజయకుమార్, బొల్లాపల్లి, వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యులు వి.సాయితేజ, ఎం.సాయి వినూత్నలు పాల్గొని మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ యాక్ట్ 1994 ప్రకారం లింగనిర్ధారణ పరీక్షలు నేరమని, 3 సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందని, లింగ వివక్షత చూపరాదని తెలియజేశారు. ఆడపిల్లలను చదివించాలని, వారిని స్వేచ్ఛగా బాలురతో సమానంగా పెంచాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.శ్రీదేవి, ఎస్‌కె మస్తాన్‌బీ, ఆర్ పద్మజ రాణి ఎఎన్ఎమ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళ సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని జంగాలపల్లి ఎస్సీ కాలనీలో మాసిపోగు మరియదాసు (40) అనుమానాస్పదంగా మృతిచెందాడు. కాలనీకి చెందిన మరియమ్మ అనే మహిళ ఇంటి ముందు అర్ధరాత్రి సమయంలో విగతజీవిగా పడిఉండటంతో కాలనీ వాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డి సంఘటనా ప్రాంతానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతుని తల్లి పున్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

శావల్యాపురం: కంది పంటలో వెర్రి తెగులు లక్షణాలు కనిపిస్తే వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దినేని శివకుమారి అన్నారు. గురువారం మండలంలోని శావల్యాపురం, శానంపూడి గ్రామాల పరిధిలో దెబ్బతిన్న కంది పంట పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా శావల్యాపురం గ్రామానికి చెందిన కొండారెడ్డి సాగు చేసిన ఎనిమిది ఎకరాల కంది పంట పూర్తి స్థాయిలో దెబ్బతిందని వ్యవసాయ అధికారులు నిర్ధారించారు.